www.nagaranijam.com PRGI/RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NN TV TELANGANA నగర నిజం

| సంపుటి : 14 | సంచిక : 2 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 26,గురువారం,మార్చి 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 2 | Rangareddy | Editor : Yela Purushotham | 26,Thursday,March,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## శంషాబాద్ లో సీఎన్జీ గ్యాస్ కోసం ఆటో డ్రైవర్ల కష్టాలు

- కిలోమీటర్ల మేర గంటలకొద్దీ గ్యాస్ కోసం పడిగాపులు
- పోలీసు భద్రత మధ్యన ఆటో డ్రైవర్లకు గ్యాస్ సరఫరా









రాజేంద్రనగర్, మార్చి 25(నగరనిజం ప్రతినిధి):ఇరాన్ తో ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం నేపథ్యంలో ఆటో డ్రైవర్లను సీఎన్జీ కష్టాలు వెంటాడుతున్నాయి.సీఎన్జీ గ్యాస్ కొరతతో బంకుల కిలోమీటర్ల మేర గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమ్య గోచరంగా మారాయి. పశ్చిమసియా లో భీకర యుద్ధం నేపథ్యంలో ఇంధనం కొరత ప్రతి ఒక్కరినీ కన్నీళ్లు తెప్పిస్తోంది. ప్రతి మనిషికి పెట్రోల్, డీజిల్ తో పాటు సీఎన్జీ తప్పనిసరి కావడంతో జనం అల్లాడిపోతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ లో సీఎన్జీ కష్టాలు ఆటో డ్రైవర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. సీఎన్జీ కోసం బంకుల వద్ద కిలోమీటర్ల మేర గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ ఆదేశాల మేరకు ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, సీఐ సంజీవ సారథ్యంలోరంగంలోకి దిగిన ఆర్.జి.ఐ.ఏ పోలీసులు.... బంకుల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసు భద్రత మధ్యన ఆటో డ్రైవర్లకు సీఎన్జీ గ్యాస్ సరఫరా చేయిస్తున్నారు. దీంతో సీఎన్జీ కష్టాలు ఆటో డ్రైవర్లకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.సీఎన్జీ కొరత కారణంగా ఆటోలు నడుపుకునే పరిస్థితి లేదని, దీంతో అటు ఈఎంఐలు కట్టుకోలేక, కుటుంబ భారాన్ని మోయలేక అవస్థలు పడుతున్నామని డ్రైవర్లు వాపోతున్నారు. పశ్చిమాసియా దేశాల్లో కొనసాగుతున్న యుద్ధం ఇంకా ఎన్నిరోజులు కొనసాగుతుందోనని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలి

- ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి
- కాగజ్ ఘట్ సిరి రిసార్ట్స్ లో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన



ఇబ్రహీంపట్నం, మార్చి 25 ( నగరనిజం ) : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు సలగాలని ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలం కాగజ్ ఘట్ గ్రామంలోని సిరి రిసార్ట్స్ లో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. ఆ సీతారాముల ఆశీస్సులతో ప్రజలంతా సుఖ,సంతోషాలతో పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. సీతారాముల అనుగ్రహం అందరికీ లభించాలని కోరుకుంటున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా జరుపుకునే అచ్చమైన పండుగ శ్రీరామనవమని రాష్ట్రంలో తెలుగు వాకిళ్ళన్ని పండుగ శోభయామానంతో కలకలలాడుతూ అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా ఈ పండుగ అందరికీ శుభాలను చేకూర్చాలని, రైతులకు సకాలంలో పాడిపంటలు సమృద్ధిగా పండి ఆనందంగా రైతులు జీవించాలని ఆ సీతారాముల వారిని కోరినట్లు తెలిపారు. ఆ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపనతో గ్రామానికి పూర్తి వైభవం రావాలని కోరారు. యావత్తు మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం అన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సిరి రిసార్ట్స్ నిర్వహకులు ముప్పాల నర్సరాజు మర్రి నిరంజన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరి నేచర్స్ వ్యాలీ రిసార్ట్స్ నిర్వహకులు ముప్పాల నర్సరాజు, గ్రామ సర్పంచ్ బాకారం శిల్పా రెడ్డి, ఉపసర్పంచ్ మైలారం శ్రీనివాస్, నాయకులు కమలాకర్ రెడ్డి, భాషయ్య, బీజేపీ నాయకులు లచ్చిరెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెలు లేని గ్రామాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి






మహేశ్వరం మార్చి 25, (నగరనిజం) :రాష్ట్రంలో గుడిసెలు లేని గ్రామాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన మహేశ్వరం మండలంలో విస్తృత స్థాయి పర్యటన చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో ఒక్క పేదవాడికి సైతం సొంతింటి కల నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. ఎన్ డి తండా గంగారం గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు చేయించారు. సొంత ఊర్లోనే బడుగు బలహీన వర్గాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఐదు లక్షల ఇస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు సహా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కేఎల్ఆర్ తెలిపారు.

# నగరనిజం

# జిల్లా అనుబంధం

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సామర్థ్యవంతంగా అమలు చేయాలి

**99 రోజుల కార్యచరణను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 25 నగర నిజం : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామా సభలు ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు అదనపు కలెక్టర్ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి ల తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 2 నుండి వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు .గ్రామ సభ మరియు మండల ,నియోజకవర్గ పరిదిలో సభలు ఏర్పాటు చేసే విధంగా ప్రణాలికలు సిద్ధం చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయం, సన్న బియ్యం బోనస్, రైతు భరోసా, రైతు భీమా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు ఎంత మంది లబ్ది దారులకు అందజేశారు, ఇంకా ఎంత మందికి ఇవ్వ వలసి ఉంది, ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు ఇప్పటి వరకు చేసిన వాటి పూర్తి సమాచారము తో లిస్టు సబ్మిట్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్ డి ఓ వాసు చంద్ర, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, సిపి ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బకారం గ్రామంలో 116 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు డాక్టర్.దేవి.రెడ్డి అమ్డాపూర్ పశు వైద్యధికారి





మొయినాబాద్, మార్చి 25 (నగర నిజం): డాక్టర్ సుభాష్ సహాయ సంచాలకులు బకారం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమం లో భాగంగా తేదీ 25.03.26 రోజు బకారం గ్రామంలో 116 పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు ఇవ్వడం జరిగింది. డివిఎహెచ్ఓ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. సుభాష్ ఆకస్మికంగా బకారం గ్రామంలో లో టీకాల కార్యక్రమాన్ని సందర్శించి, అక్కడ రైతులకు గాలి కుంటు వ్యాధి నివారణ గురుంచి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బాకారం సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్ సుభాష్ రెడ్డి, వార్డు సభ్యులు , పశు వైద్య సిబ్బంది ఓ.ఎస్ రవి, పశు పోషకులు పాల్గొన్నారు. గాలి కుంటు వ్యాధి ఆఫ్తో వైరస్ వలన సంక్రమిస్తుంది. ఈ వ్యాది వలన తీవ్రమైన జ్వరం, నోటిలో పుండ్లు ఏర్పడి మేత తినలేకపోవడం, కాళ్ళలో పుండ్లు వచ్చి నడవ లేకపోవడం వలన పాడి పశువలలో పాల ఉత్పత్తి తగ్గడం, పునరుత్పత్తి మరియు పని సామర్థ్యం తగ్గడం వలన రైతుకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. కావున 3 నెలలు పైబడిన అన్ని గోజాతి మరియు గేదె జాతి పశువులకు ఈ టీకాలు తప్పక ఇప్పించుకొండి. కావున మీ గ్రామాలకు పశు వైద్య సిబ్బంది వచ్చినపుడు మీరు సహకరించగలరు ఈ యొక్క కార్యక్రమంన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలీ.

# సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం హైదరాబాదులోనే ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీ ముట్టడి వెళ్లే క్రమంలో జైపాల్ నాయక్ అరెస్ట్
- ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని బంజారాల ఐక్యవేదిక హెచ్చరిక.



మెదక్ బ్యూరో: నగర నిజం : తూప్రాన్ : సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రాన్ని హైదరాబాదులోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లా బంజారాల ఐక్యవేదిక అధ్యక్షుడు జైపాల్ నాయక్‌ను తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా జైపాల్ నాయక్ మాట్లాడుతూ, లంబాడీల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం కావడంతో సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రాన్ని వారు కోరిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలని అన్నారు. పుణ్యక్షేత్రాన్ని అడవుల్లో ఏర్పాటు చేయడం కంటే హైదరాబాదులో ఉండటం సముచితం కాదా అని ప్రశ్నించారు.అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో తమను అడ్డుకుని అరెస్ట్ చేయడం తగదని విమర్శించారు. అరెస్టులు, అడ్డంకులు వచ్చినా తమ ఉద్యమం ఆగదని, హైదరాబాదులోనే పుణ్యక్షేత్రం ఏర్పాటు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.అదేవిధంగా అన్ని కుల సంఘాల ప్రతినిధులతో చర్చించి తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

# - ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలి - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- శంషాబాద్ ఇంద్రారెడ్డి నగర్ కాలనీలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన వేడుక
- ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని బండి గోపాల్ యాదవ్ కు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రశంస










రాజేంద్రనగర్, మార్చి 25(నగరనిజం ప్రతినిధి):దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. దేవుడిపై భక్తి మనిషికి ఎంతో మానసిక ఉల్లాసాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని రాల్లగూడ ఇంద్రారెడ్డి కాలనీ లో శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుధవారం నాడు నిర్వహించిన ఈ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.... స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.... ఇంద్రారెడ్డి కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని అద్భుతంగా తీర్చి దిద్దారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ పై ప్రశంసలు కురిపించారు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ ప్రకాష్ గౌడ్ అభినందించారు. నేటి సమాజంలో అనేక సమస్యలతో మనిషి సతమతమవుతున్నాడని, అలాంటి తరుణంలో భక్తి మార్గంలో నడవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. శ్రీరామనవమి వేడుకలకు ముందు ఇంద్రారెడ్డి కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన జరగడం సంతోషమన్నారు. బండి గోపాల్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి కాలనీ శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విగ్రహ ప్రతిష్టాపనకు ముందు బండి గోపాల్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో నవగ్రహాల పూజ, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయం ఎదురుగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు పలువురు నేతలకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. మరోవైపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు పార్టీ సీనియర్ నేతలు ఆర్ గణేష్ గుప్తా, దూడల వెంకటేష్ గౌడ్, కొడిగంటి చంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు వై కుమార్, మేకల వెంకటేష్ ముదిరాజ్, పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్, చిన్న గోల్కొండ మాజీ సర్పంచ్ గుర్రం పద్మావతి అనంతరెడ్డి,గొల్లపల్లి మాజీ సర్పంచ్ జిట్టే సిద్ధులు, స్థానిక నేతలు నాగేష్ యాదవ్, శివారెడ్డి, బండి వెంకటేష్ యాదవ్ తదితరులను బండి గోపాల్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగం పంచుకున్న ప్రతి ఒక్కరికి గోపాల్ యాదవ్ కృతజ్ఞతలు చెప్పారు. సమిష్టి కృషితోనే ఇంద్రారెడ్డి కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించుకోగలిగామని బండి గోపాల్ యాదవ్ అభిప్రాయపడ్డారు.

# ఈ-మొబిలిటీ రంగంలో కేకేఎల్ తొలి అడుగు

- హైదరాబాద్‌లో 'దండూ'స్ ఈవీ కేకేఎల్ డీలర్‌షిప్ ప్రారంభం





ఎల్బీనగర్, మార్చి 25 (నగర నిజం): ఈ-మొబిలిటీ రంగంలో అడుగుపెట్టిన కేకేఎల్ గ్రూప్ తెలంగాణలో తన కార్యకలాపాలను ప్రారంభించింది. హైదరాబాద్‌లో 'దండూ'స్ ఎలక్ట్రికల్ వెహికిల్స్' పేరుతో తొలి డీలర్‌షిప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ, కేకేఎల్ హైటెక్ ఈవీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ డా. సి.ఎన్. గోపీనాథ్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ మత్స్యశాఖ చైర్మన్ ఎం. సాయికుమార్, సంస్థ ఎండీ అడైకలం షణ్ముగం, డైరెక్టర్ డా. వెంకట కె. గంజాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశం క్లీన్ మొబిలిటీ వైపు వేగంగా పయనిస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈవీ రంగంలో మంచి అవకాశాలు కలిగిన మార్కెట్‌గా ఎదుగుతోందని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి అనుగుణంగా కేకేఎల్ సంస్థ స్థానిక భాగస్వాములతో కలిసి వినియోగదారులకు అందుబాటులో ఉండే ఈవీలను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్‌లోని, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం సమీపంలో ఈ షోరూమ్‌ను యువ పారిశ్రామికవేత్తలు నరేష్ దండు, రాజు దండు నిర్వహిస్తున్నారు. సంస్థ ఎండీ అడైకలం షణ్ముగం మాట్లాడుతూ భారతదేశంలో ఈవీ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాల విభాగంలో వేగంగా వృద్ధి జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా సుమారు 1% మాత్రమే ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఇది భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. సాంకేతిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల పెంపు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఈవీ వినియోగాన్ని మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో ప్రతి నెల ఐదు కొత్త డీలర్‌షిప్‌లు ప్రారంభించాలని కేకేఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, వికార్‌బాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం నగరాల్లో విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసింది. 2026 మే నాటికి 10 డీలర్‌షిప్‌లు ప్రారంభించి, ప్రతి డీలర్ నెలకు సుమారు 200 యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కేకేఎల్ సంస్థ ప్రస్తుతం గ్రెటా, క్రెస్ట్, ఫించ్, స్పార్టన్, గ్రీన్ రైడర్, వెస్పర్ వంటి మోడళ్లను మార్కెట్‌లో అందిస్తోంది. ఈ వాహనాల ధరలు రూ.50,000 నుంచి రూ.1.5 లక్షల వరకు ఉన్నాయి. లిథియం అయాన్ బ్యాటరీలతో ఆధునిక ఫీచర్లను కలిగి ఉన్న ఈ వాహనాలు వినియోగదారులకు సరసమైన ధరలో అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది. డైరెక్టర్ డా. వెంకట కె. గంజాం మాట్లాడుతూ 2026-27లో దక్షిణ భారతదేశంలో వందకు పైగా డీలర్‌షిప్‌లు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సంస్థకు ఈవీ రంగంలో రెండు దశాబ్దాల అనుభవం ఉండగా, ఇప్పటికే 25 వేలకుపైగా వాహనాలను విక్రయించినట్లు వెల్లడించారు. అమ్మకాల అనంతర సేవలు, విడిభాగాల అందుబాటు, తేలికపాటి బ్యాటరీల వినియోగం ద్వారా వినియోగదారుల సంతృప్తిని పెంచడంపై సంస్థ ప్రత్యేక దృష్టి పెట్టిందని డైరెక్టర్ ఫైజల్ అహ్మద్ తెలిపారు.

# బస్వాయపల్లిలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీఓ




మార్చి 25, (నగరనిజం ప్రతినిధి)మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామంలో దేవరకద్ర మండల ఎంపీడీఓ శ్రీనివాస రావు ఇందిరమ్మ ఇండ్లను బుధవారం రోజు పరిశీలించడం జరిగింది.లబ్ధిదారులకు తమ అకౌంట్స్ లలో ఇందిరమ్మ బిల్లులు పడుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవడం జరిగింది.అనంతరం గ్రామంలో పర్యటించి సీసీ రోడ్లు,డ్రైనేజి,పల్లె ప్రకృతి వనం సందర్శించి సమస్యలు తెలుసుకొన్న ఎంపీడీఓ శ్రీనివాస్ రావు.ఈ కార్యక్రమం లో బస్వాయిపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ రాంచంద్రయ్య,సర్పంచ్ శివ కుమార్,ఉప సర్పంచ్ గోవర్ధన్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విక్రవర్ధన్ రెడ్డి,వెంకటయ్య,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ వార్ ఎఫెక్ట్.. త్వరలో 10-12 శాతం బీర్ల ధరలు పెరిగే ఛాన్స్...?



న్యూ ఢిల్లీ మార్చ్ 25 (నగరనిజం న్యూస్ );ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో ఇప్పటికే ఇండియాలో చమురు సంక్షోభం మొదలైంది. త్వరలో ఎరువుల కొరత వేధించే అవకాశం ఉంది. మరోవైపు ఔషధాల ధరలు కూడా పెరగొచ్చు. ఈ నేపథ్యంలో ఇండియన్స్‌కు మరో షాక్ తగిలే అవకాశం ఉంది. ఇండియాలో త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా విదేశీ బ్రాండ్లు తమ బీర్ల ధరల్ని పెంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ యుద్ధం కారణంగా రవాణా స్తంభించిపోవడమే దీనికి ప్రధాన కారణం. బీర్ల తయారీలో వాడే గ్లాస్ బాటిల్స్, అల్యూమినియం క్యాన్ల తయారీకి అవసరమైన ముడిసరుకు విదేశాల నుంచే వస్తుంది. ప్రస్తుతం యుద్ధం కారణంగా రవాణా నిలిచిపోయి, వీటి దిగుమతులు ఆగిపోయాయి. దీంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. మరోవైపు చమురు ధరలు పెరగడం కూడా బీర్ల తయారీపై ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో నాలుగోవంతు నేచురల్ గ్యాస్‌ను ఇండియా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అది కూడా ఎక్కువగా పశ్చిమాసియా నుంచే వస్తుంది. అందులోనూ ఖతార్ నుంచే 40 శాతం చమురు దిగుమతి అవుతుంటుంది. కానీ, ఇప్పుడు గ్యాస్ సరఫరా లేక చమురు ధరలు పెరగడం, బాటిల్స్ సరఫరా నిలిచిపోవడంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ కారణంగా గ్లాస్ బాటిల్ ధరలు 20 శాతం పెరిగాయి. అలాగే, బీర్లను ఉంచే పేపర్ కార్టన్ రేట్లు కూడా రెట్టింపైనట్లు తయారీ కంపెనీలు చెబుతున్నాయి.లేబుల్స్, టేప్స్ వంటి ధరలు కూడా పెరిగాయి. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా లేకపోవడంతో వీటన్నింటి తయారీ సంస్థలు తమ తయారీని తగ్గించాయి. ఫలితంగానే రేట్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీర్ల ధరలు పెంచాలని ప్రయత్నిస్తున్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు. వేసవి కాలం కావడం, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తమపై భారం తగ్గాలంటే 12 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని ప్రభుత్వాల్ని కోరుతున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వాలు అంగీకరిస్తే త్వరలోనే బీర్ల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# పేద స్వర్ణకారుడి వైద్యానికి రూ. 42 వేల వెస్పో సహాయం



హైదరాబాద్ మార్చ్ 25 (నగరనిజం న్యూస్ ); మీర్‌పేట్, సరూర్ నగర్ నివాసి శ్రీ రంగంగారి నరేష్ చారి (40) వృత్తి రీత్యా స్వర్ణకారులు; స్థానిక జ్యువెలరీ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇటీవల ఆయనకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో సమీపం లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స జరుగుతున్న సమయంలో ఒక యాంటీ బయాటిక్ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత అకస్మాత్తుగా హార్ట్ అటాక్ (కార్డియాక్ అరెస్ట్) వచ్చి, దానితో పాటు, మెదడుకు కూడా గాయమైనట్లు వైద్యులు గుర్తించారు.ఇప్పటి వరకు వారి కుటుంబం ఆయన చికిత్స కోసం తమ శక్తిని మించి ఖర్చు చేసింది. మొదట ఈ చికిత్స ఇన్సూరెన్స్ క్రింద కవర్ అవుతుందని భావించినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇన్సూరెన్స్ కంపెనీ వారి క్లెయిమ్‌ను అంగీకరించ లేదు. అందువలన వారి కుటుంబం ఇప్పటి వరకు సుమారు ?2,00,000/- నగదుగా చెల్లించ వలసి వచ్చింది. వారి కుటుంబం ఆర్థికంగా బలహీన స్థితిలో ఉండడం తో, ఆయన భార్య శిరీష పెరుగుతున్న ఆసుపత్రి ఖర్చులను భరించ లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పరిస్థితిలో వెస్పో ట్రస్ట్ గురించి తెలుసుకుని, స్థానిక సంఘ నాయకుల ద్వారా తన భర్త చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించమని వెస్పో ను కోరారు. వెస్పో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో శిరీష కు42,400 రూపాయలు అందజేశారు.

# స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్‌కు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఘన సన్మానం




**హైదరాబాద్ మార్చ్ 25 (నగరనిజం న్యూస్ );తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలలో , రెండవ విడత సీఎం కప్ పోటీల నిర్వహణలో విశిష్ట సేవలు అందజేసిన స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్ ను సన్మానిస్తున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పద్మభూషణ్, ఒలంపియన్ సైనా నెహ్వాల్ మరియు ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.**

# తెలంగాణలో ఇంధన కొరత ఉందని తప్పుడు వార్తలు నమ్మొద్దు

- తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్



దహైదరాబాద్ మార్చ్ 25 (నగరనిజం న్యూస్ ) : తెలంగాణలో ఇంధన కొరత ఉందని తప్పుడు వార్తలు నమ్మొద్దని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేశారు. అవాస్తవ ప్రచారాల వల్ల ప్రజలు అనవసరంగా బంకుల వద్ద క్యూ కడుతున్నారని వెల్లడించారు. ప్రస్తుతం హెచ్‌పీసీఎల్ , ఐఓసీఎల్ , బీపీసీఎల్ ,వంటి కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపారు.రాష్ట్ర వార్తలుసరఫరా గొలుసు ఎక్కడా ఆగలేదని, భయం వల్ల ప్రజలు ఒక్కసారిగా కొనుగోలు చేయడం వల్ల సాధారణం కంటే 2.5 నుంచి 3 రెట్లు విక్రయాలు పెరిగాయని వివరించారు. దీనివల్ల కొన్ని బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ అయిపోవచ్చు. కానీ అది కొరత కాదని, పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాల్లో, క్యాన్లలో నింపి నిల్వ చేయడం పీఈఎస్‌వో నిబంధనలకు విరుద్ధమని అన్నారు.ఇటువంటి చర్యలు చాలా ప్రమాదకరమని, అగ్ని ప్రమాదాలకు దారి తీయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమకు అవసరమైనంత మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

నగరనిజం
తెలుగు దిన పత్రిక
26 గురువారం,మార్చి,2026

# జి.ఓ. నెం. 84 వ్యతిరేకంగా తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ అసంబ్లీ ముట్టడి

• పోలీసుల అరెస్ట్ ..ఆయా పోలీస్ స్టేషన్ కు తరలింపు





హైదరాబాద్, మార్చి 25,(నగరనిజం న్యూస్ ); తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 84 మరియు కొత్త ఔట్‌డోర్ ప్రకటన విధానానికి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ (టూమీ) బుధవారం అసంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది.. రాష్ట్ర అసెంబ్లీ వద్ద నిరసన చేపట్టి, “అసెంబ్లీ మార్చ్” నిర్వహించింది. ఈ నిరసనలో వందలాది ఔట్‌డోర్ మీడియా యజమానులు, కార్మికులు మరియు పరిశ్రమకు చెందిన ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఔట్‌డోర్ ప్రకటన రంగం మనుగడను ప్రమాదంలోకి నెట్టే “పరిశ్రమ వ్యతిరేక” విధానంగా వారు అభివర్ణిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారులు నినాదాలు చేస్తూ, జి.ఓ. నెం. 84 ను వెంటనే రద్దు చేయాలని, కొత్త విధానాన్ని పూర్తిగా పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.టూమీ ప్రతినిధులు పేర్కొన్న ప్రకారం, ఈ కొత్త నిబంధనలు పరిశ్రమకు చెందిన భాగస్వాములతో సరైన సంప్రదింపులు లేకుండానే అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమగ్ర చర్చలు జరపాలని ముందుగా ఉన్న మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత రూపంలో ఈ విధానం వేలాది వ్యాపారాలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చే అవకాశం ఉందని, ఔట్‌డోర్ ప్రకటన రంగంపై ఆధారపడి జీవిస్తున్న దాదాపు లక్ష కుటుంబాల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.జి.ఓ. నెం. 84 అమలు విషయంలో ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం మొత్తం ఔట్‌డోర్ మీడియా పరిశ్రమను ప్రమాదంలోకి నెట్టింది. మేము నియంత్రణకు వ్యతిరేకం కాదు, కానీ విధానాలు వాస్తవానికి అనుగుణంగా, పారదర్శకంగా ఉండాలి మరియు భాగస్వాములతో సంప్రదింపుల ద్వారా రూపొందించాలి,” అని టూమీ ప్రధాన కార్యదర్శి శ్రీ రమేష్ నిరసన సందర్భంగా పేర్కొన్నారు.ఈ విధానం అమలు విషయంలో ఆలస్యాలు, స్పష్టత లేమి, అధిక అనుసరణ భారాలు వంటి అనేక పరిపాలనా మరియు కార్యాచరణ సమస్యలను కూడా సంఘం ప్రస్తావించింది. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించింది.టూమీ తెలంగాణ ప్రభుత్వం మరియు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని తక్షణం జోక్యం చేసుకుని, జి.ఓ. నెం. 84 అమలును నిలిపివేసి, పరిశ్రమ ప్రతినిధులతో సార్థక చర్చలు ప్రారంభించి, సమతుల్యమైన మరియు స్థిరమైన విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేసారు..

# హైదరాబాద్ చేరుకున్న ప్రముఖ ఎన్నారై ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్

• శంషాబాద్ విమానాశ్రయంలో ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ కు ఘనంగా స్వాగతం పలికిన నేతలు



రాజేంద్రనగర్, మార్చి 25(నగరనిజం ప్రతినిధి):గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ కు చెందిన ప్రముఖ ఎన్నారై, అమెరికాలో ప్రముఖ వ్యాపారవేత్త ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ హైదరాబాద్ చేరుకున్నారు. మూడు నెలల అనంతరం అమెరికా నుండి హైదరాబాద్ చేరుకున్న ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ కు శంషాబాద్ విమానాశ్రయంలో పలువురు స్థానిక నేతలు ఘనంగా స్వాగతం పలికారు. శంషాబాద్ కు చెందిన ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ అలియాస్ రఫిక్ బాయ్.... చాలా ఏళ్ల క్రితం అమెరికాకు వలస వెళ్లారు. ఈ మేరకు అమెరికాలోని చికాగోలో స్థిరపడ్డ ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్.... అక్కడ వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. చికాగోలో స్థిరపడ్డ ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ అమెరికాలో ద్వంద్వ పౌరసత్వం కలిగిన తొలి భారతీయుడు కావడం విశేషం. చికాగోలో వివిధ వ్యాపారాలు సాగించేఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్.... మూడు నెలల అనంతరం హైదరాబాద్ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత అస్లాం ఖాన్ ఆధ్వర్యం లోని పలువురు నేతలు శంషాబాద్ విమానాశ్రయంలో ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ కు ఘనంగా స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆ తర్వాత విమానాశ్రయం నుండి ఆయన నేరుగా శంషాబాద్ లోని తన నివాసానికి చేరుకున్నారు.

# చౌటుప్పల్ ని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని ఆర్‌డిఓకి వినతి



చౌటుప్పల్ 25 మార్చి ( నగర నిజం) : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నది కావున అందులో భాగంగా చౌటుప్పల్ ని కూడా అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి నాయకులు కోరారు. చౌటుప్పల్ ఆర్ డి ఓ కి చౌటుప్పల్ నియోజకవర్గ సాధన సమితి నాయకులు చౌటుప్పల్ ని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం, దాదాపు 7 మండలాల ప్రజలు విద్యా, వైద్యం, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఈ చౌటుప్పల్ పైన ఆధారపడి నిత్యం వేల సంఖ్యలో ఇక్కడికి రాకపోకలు నిర్వహిస్తుంటారు. చౌటుప్పల్ అన్ని రంగాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండడం వల్ల వేల సంఖ్యలో ప్రజలు ఇక్కడ నివసిస్తుండడంతో ఇది అన్ని రకాలుగా అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అర్హత ఉన్నది. కావున చౌటుప్పల్, నారాయణపూర్, గట్టుప్పల్, చిట్యాల, రామన్నపేట, వలిగొండ, పోచంపల్లి మండలాలను కలిపి చౌటుప్పల్ ని కేంద్రంగా చేసుకుని చౌటుప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటుచేయాలని కోరుతున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టెల లింగస్వామి, బర్రె రాజు పెరియార్, బోయ కుమార్, దాసరి ప్రకాష్, పంది రాకేష్, చేకూరి బాబు, నేరడి మహేష్, కట్టెల ప్రకాష్, సిరిపంగి చందు, చిత్రాల హరిప్రసాద్, పగిళ్ళ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

• ఎస్ ఎఫ్ ఐ నాయకుల హెచ్చరిక



చౌటుప్పల్ మార్చి 25 (నగర నిజం) :విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం శాంతియుతంగా సాగుతున్న ‘ఛలో అసెంబ్లీ’ పిలుపు మేరకు తరలి వెళుతున్న చౌటుప్పల్ మండలం ఎస్ ఎఫ్ ఐ నాయకులను ముందస్తు గా అరెస్ట్ చేసి అణచివేయాలని చూడటం ప్రభుత్వ పిరికిపంద చర్య అని ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం దుర్మార్గం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 30% కేటాయింపు చేయాలని అన్నారు..ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయినా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు,పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు స్కాలర్షిప్ అందకపోవడం వల్ల విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉన్నది పేద విద్యార్థుల ను విద్యకు దూరం చేసే పరిస్థితి ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు.అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలు సంక్షేమ వసతిగృహాలు కేజీబీవీలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు .తెలంగాణ రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం 2020 అమలు కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని అన్నారు. రాష్ట్ర యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలని ఎస్ ఎఫ్ ఐ నాయకులు డిమాండ్ చేశారు.

# విజ్ డమ్ హై స్కూల్‌లో ప్రయోగాత్మకంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్





రాయికల్ మార్చి 25 (నగర నిజం) జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలోని విజ్ డమ్ హై స్కూల్ లో బుధవారం రోజు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ప్రోగ్రాం ను ప్రయోగాత్మకంగా, ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీష్,సబ్జెక్ట్ లకు సంబంధించిన వివిధ రకాల ప్రయోగాలు మరియు కళాకృతులు తయారు చేసి ప్రదర్శించారు. 2025-26 విద్యా సంవత్సరం లో వారు నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.కార్యక్రమానికి వందల సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను చూసి అబ్బుర పోయారు.విద్యార్థులు బ్లడ్ గ్రూపింగ్ పరీక్ష అందరిని ఆకట్టుకుంది.తల్లిదండ్రులు వారి పిల్లలలో దాగిఉన్న సృజనత్మకతను చూసి ఆనందించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ పిల్లలకు కేవలం పుస్తకాలలో ఉన్న చదువే కాకుండా , వారు సంవత్సర కాలంలో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని, ప్రయోగాత్మకంగా, అర్థవంతంగా ప్రదర్శించడం లోనే వారి యొక్క విషయ నైపుణ్యత స్పష్టమవుతుందని సంతోషం వ్యక్తం చేసారు.పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు కేవలం పాఠాలు బోధించడం, మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా, రాయికల్ మండల చరిత్ర లో మొట్టమొదటి సారిగా లీడ్ పినాకిల్ ప్లస్ ద్వారా ప్రతి క్లాసులో టీవీ ప్రతి టీచర్ కు ట్యాబ్ ద్వారా డిజిటల్ విద్యాబోధన అందిస్తూ రాష్ట్రస్థాయి లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న ఏకైక విద్యా సంస్థ అని,మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీ పడే విధంగా తయారు చేస్తున్నామని, చిన్నతనం నుండే డిజిటల్ సాంకేతికత ను బోధిస్తూ వారి ఉజ్వల భవిష్యత్ కు బాటలు వేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీనియర్ అకాడమిక్ అడ్వైజర్లు సుష్మేంద్ర, , ఐశ్వర్య, లీడ్ ఐఐటి ఫౌండేషన్ సౌత్ అకాడమిక్ ఎక్సలెన్స్ మేనేజర్ రిజ్వాన్ మాట్లాడుతూ లీడ్ పినాకిల్, మరియు ఐఐటీ యొక్క ప్రాముఖ్యత ను వివరించారు.ఈ కార్యక్రమం లో డైరెక్టర్ నివేదిత రెడ్డి,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు చల్లని మజ్జిగతో ఉపశమనం



రాయికల్ మార్చి 25 (నగర నిజం) ఎండల తీవ్రత దృష్ట్యా జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామ శివారులోని నల్లగుట్ట వద్ద ఫారం పండ్ పనిచేస్తున్న ఉపాధిహామీ పథకం కూలీలకు రాయికల్ శ్రీ యశోద హాస్పిటల్ వారి అధ్వర్యంలో సుమారు 150 మందికి బుధవారం చల్లని మజ్జిగను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీ యశోద మేనేజింగ్ డైరెక్టర్ ఆదిముల్క ప్రభాకర్ మాట్లాడుతూ.... అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ తగలకుండా తమవంతుగా చల్లని మజ్జిగను పంపిణీ చేయడం జరిగిందన్నారు.వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న తరుణంలో కూలీలు ఎక్కువగా నీరు త్రాగాలని సూచించారు.తమ హాస్పిటల్ లో రూ. 200 లకే ఒక కుటుంబానికి సంవత్సర కాలానికి హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, హెల్త్ కార్డు తీసుకున్న కుటుంబ సభ్యులకు సంవత్సరం పాటు ఓపి ఉచితంగా చూడడంతోపాటు హాస్పిటల్ ఖర్చులు, టెస్టులు,మందుల కొనుగోలుపై రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కూలీలు, గ్రామస్తులు, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం గ్రామ సర్పంచ్ దిండిగాల గంగు-రామస్వామి గౌడ్ మాట్లాడుతూ ఎండ వేడిమిని తట్టుకొని కనీస అవసరం కోసం పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సహృదయంతో ముందుకు వచ్చి చల్లని మజ్జిగను పంపిణీ చేసిన శ్రీ యశోద హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఉదయం 7 గంటల వరకు కూలీలు పని ప్రదేశానికి చేరుకొని ఉపాధిహామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి కనీస వేతనం పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ యశోద హాస్పిటల్ సిబ్బంది లక్ష్మణ్, శ్రీనివాస్ ,ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాయకులు మాద రాజేశం, లక్ష్మీనారాయణ, అనుపాల్,లక్ష్మీనర్సయ్య, శ్రీనివాస్,కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# కర్మన్‌ఘాట్‌లో జోస్నా జ్యూస్ అడ్డా ప్రారంభం






ఎల్బీనగర్, మార్చి 25 (నగర నిజం) కర్మన్‌ఘాట్ మెయిన్ రోడ్‌లో జోస్నా జ్యూస్ అడ్డా ప్రారంభం ఘనంగా జరిగింది. రాఘవేంద్ర హోటల్ పక్కన ఏర్పాటు చేసిన ఈ జ్యూస్ సెంటర్‌ను “టిపిసిసి అధికార ప్రతినిధి దరిపల్లి రాజ శేఖర్ రెడ్డి” ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ సహచరులు శ్రీధర్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దరిపల్లి రాజ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు తాజా, ఆరోగ్యకరమైన జ్యూస్ అందించడం ద్వారా మంచి సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జ్యూస్ అడ్డా యాజమాన్యానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. “జ్యూస్ అడ్డా ప్రొప్రైటర్ సుదర్శన్” మాట్లాడుతూ, కస్టమర్లకు నాణ్యమైన, తాజా ఫలాలతో తయారుచేసిన జ్యూస్ అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరికి శుభ్రత, రుచితో కూడిన సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఆదరణతో ఈ వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నామని అన్నారు.

# రాళ్లగూడ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న చేవెళ్ల ప్రసాద్

• మధురానగర్ కాలనీ వాసులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రసాద్





రాజేంద్రనగర్, మార్చి 25(నగరనిజం ప్రతినిధి):గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని మధురానగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత చేవెళ్ల ప్రసాద్ రాళ్లగూడ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించారు. రాళ్లగూడ ఇంద్రారెడ్డి కాలనీలో శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ఈ అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన బుధవారంనాడు ఘనంగా జరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత, శంషాబాద్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యురాలు చేవెళ్ల కవిత భర్త చేవెళ్ల ప్రసాద్ తో పాటు కాలనీ నేత జెల్లపల్లి శ్రీనివాస్ తదితరులు కలిసి స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి చేవెళ్ల ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన వేడుకకు హాజరైన చేవెళ్ల ప్రసాద్ తదితర నేతలను బండి గోపాల్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చేవెళ్ల ప్రసాద్... బండి గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని ప్రశంసించారు.అభయాంజనేయ స్వామి కృప కటాక్షాలతో ప్రజలంతా చల్లగా ఉండాలని చేవెళ్ల ప్రసాద్ ఆకాంక్షించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రామ మందిర పునఃనిర్మాణ మహోత్సవం





నగర నిజం తాండూర్ ప్రతినిధి మార్చ్ 25:::వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణం ఇందిరానగర్ లో వెలసిన ఏకైక శ్రీ రామ మందిర పునఃనిర్మాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం దేవాలయ ప్రాంగణంలోశ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాల ప్రాణ ప్రతిష్టతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా జరిపారు. కొన్ని రోజులుగా ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతుండగా, బుధవారం జరిపిన ప్రధాన ఘట్టంతో కాలనీ అంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్నది. ఉదయం నుంచే పూజలు, హోమాలు, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ విగ్రహాలను ప్రతిష్టించారు.ఈ వేడుకకు ఇందిరా నగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జై శ్రీరామ్.. అంటూ నినాదాలతో దేవాలయ పరిసరాలు మారుమ్రోగాయి. యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.మహిళలు భజనలు, కోలాటాలతో అలరించారు.అందరి సమిష్టి కృషితో ఈ కార్యక్రమం వైభవంగా విజయవం తమైందని దేవాలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం "చలో హైదరాబాద్" కార్యక్రమం




హైదరాబాద్, 25, నగర నిజం, ఎర్రమన్ను బాలరాజ్:జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం "చలో హైదరాబాద్" కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న జర్నలిస్టులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్నట్లే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం, వృద్ధాప్య పెన్షన్లు అందించడం వంటి అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు.ఇక చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రకటన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండ రూ.6 లక్షల ఎల్ఓసీ అందజేసిన సుదీర్ రెడ్డి



ఎల్బీనగర్ మార్చి 25 (నగర నిజం) ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు విశేష లబ్ధి చేకూరుతోందని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి తెలిపారు. మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ కాలనీలో నివసిస్తున్న షేక్ రుమాన్ మెహది (16) చెవి వినికిడి సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో, వారి కుటుంబం ఎమ్మెల్యేను సంప్రదించింది. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి, ఆపరేషన్‌కు అవసరమైన ఖర్చుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దాని ఫలితంగా రూ.6 లక్షల ఎల్ఓసీ చెక్కును బాధితుడి తండ్రి షేక్ అలీపాషాకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణలో సీఎం సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. అధునాతన వైద్య సేవలను పొందేందుకు ఈ పథకం పేదలకు వరంలాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరి, సురేందర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# -అనుమతి లేకుండా అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు-

## జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ దశరథ

**60 లక్షల విలువైన అక్రమ మద్యంను ధ్వంసం చేసిన శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు**

**గడిచిన ఆరు నెలలుగా శంషాబాద్ విమానాశ్రయంలో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం**

**జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ దశరథ, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ సమక్షంలో మద్యం ధ్వంసం**

**రోడ్డు రోలర్ తో అక్రమమద్యాన్ని ధ్వంసం చేసిన శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు**






రాజేంద్రనగర్, మార్చి 25(నగరనిజం ప్రతినిధి):మందుబాబులకు నిజంగా ఇది చేదు వార్తే.... ఎందుకంటే ఒకటి కాదు రెండు కాదు దాదాపు 60 లక్షల విలువచేసే అక్రమమద్యాన్ని రోడ్డు రోలర్ తో ధ్వంసం చేసి భూమి పాలు చేశారు శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రయాణికులు అక్రమంగా తరలిస్తున్న మధ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు....బుధవారం నాడు వాటిని ధ్వంసం చేశారు. మరోవైపు విమానాలు, రైలు మార్గాలతో పాటు రోడ్డు మార్గం ద్వారా అక్రమ మార్గాల్లో మద్యాన్ని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ దశరథ తీవ్రంగా హెచ్చరించారు. కస్టమ్స్ డ్యూటీ ఫీజు చెల్లించకుండా అనుమతి లేకుండా అక్రమ మద్యాన్ని తరలించే వారిపై చర్యలు తప్పవన్నారు. శంషాబాద్ విమానాశ్రయం లో గడిచిన ఆరు నెలలుగా ప్రయాణికుల నుండి స్వాధీనం చేసుకున్న సుమారు 60 లక్షల విలువ చేసే అక్రమమద్యాన్ని బుధవారం నాడు శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. రాజేంద్రనగర్ లోని ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ కార్యాలయం ఆవరణలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ దశరథ సమక్షంలో రోడ్డు రోలర్ ద్వారా అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. గోవా, హర్యానా, ఢిల్లీ, లక్నో తదితర ప్రాంతాలను నుండి ప్రయాణికులు అక్రమ మార్గంలో మద్యాన్ని నగరానికి తరలిస్తూ పట్టుబడ్డారని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ దశరథ మీడియాకు వెల్లడించారు. పట్టుబడ్డ మద్యం విలువ సుమారు 60 లక్షలు ఉంటుందని ఆయన వివరించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద పట్టుపడ్డ అక్రమ మద్యానికి సంబంధించి ఇప్పటివరకు దాదాపు 103 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మార్గంలో మద్యాన్ని తరలించాలని చూస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమీషనర్ దశరథ తీవ్రంగా హెచ్చరించారు. అక్రమ మద్యాన్ని అరికట్టడానికి శంషాబాద్ విమానాశ్రయం తో పాటు రైల్వే స్టేషన్లు, రోడ్డు మార్గాన రాష్ట్ర సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందని ఆయన వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్న శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ బృందాన్ని డిప్యూటీ కమీషనర్ దశరథ తో పాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ అభినందించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ,శంషాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్ రెడ్డి, సీఐ దేవేందర్ రావు, ఎస్సై లతో పాటు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి.. జాతీయ స్థాయిలో ప్రతిభను చూపాలి




**• ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి**

నగర నిజం తాండూర్ ప్రతినిధి మార్చ్ 25:వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో సీనియర్ కాంగ్రేస్ నాయకులు అజయ్ ప్రసాద్ తండ్రి కిషన్ ప్రసాద్ జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొన్న బుయ్యని శ్రీనివాస్ రెడ్డి.ఈ సందర్బంగా విజేతలకు, క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు ప్రదానం చేశారు.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. యువకులు వాలీబాల్ లో అద్భుత ఆటతీరు కనబరిచారని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. జాతీయ స్థాయిలో గ్రామీణ ప్రతిభను ప్రదర్శించడానికి తాను ఎల్లవేళలా ప్రోత్సహిస్తానని, అజయ్ ప్రసాద్ తన తండ్రి పేరిట ఈ క్రీడా నిర్వహించి యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపారని తెలిపారు. యువత స్మార్ట్ ఫోన్లు విడిచి క్రీడల వైపు ఆసక్తి చూపి శారీరక ధారుడ్యానికి ప్రాధాన్యం ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలని.. భవిష్యత్తులో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించి గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్నీ వెలికి తీస్తామని అన్నారు.

# అమ్మ ఆధరణ సొసైటీ,

**• ఎంఇ ఖాది గ్రామీణ వారి ఆధ్వర్యంలో..**

**• మహిళలకి డీటేర్జెంట్ పౌడర్ లిక్విడ్, టైలరింగ్ శిక్షణ**




నగర నిజం తాండూర్ ప్రతినిధి మార్చ్ 25::వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం లక్ష్మినారాయణ పూర్ గ్రామంలో అమ్మ ఆధరణ సొసైటీ,ఎంఎస్ ఎంఇ ఖాది గ్రామీణ వారి ఆధ్వర్యంలో..20 మంది మహిళలకు డీటేర్జెంట్ పౌడర్ లిక్విడ్ ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చారు.అదేవిదంగా,30 మందికి ఎన్ జీ ఓ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ తీసుకున్నవారికి సర్టిఫికెట్లను యాలాల్ మండల ఐకేపీ ఆఫీస్ లో అందజేశారు. కార్యక్రమంలో ఎన్ జీ ఓ అధ్యక్షులు సునీత,ఐకేపీ ఏ పి ఎం శ్రీనివాస్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి పోటీలో శ్రీ చైతన్య విద్యార్థి విజయకేతనం



నాగోల్, 26, మార్చి (నగర నిజం) : అమెరికా నాసా జనవరిలో నిర్వహించిన గోడార్డ్ 100 ఆర్ట్ కాంటెస్ట్‌లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నాగోల్ శాఖకు చెందిన విద్యార్థి పుట్టంబర నితీష్ రెడ్డి ప్రతిభ చాటాడు. ఈ విషయాన్ని ఏజీఎం వెంకట్ రెడ్డి వెల్లడించారు.ప్రిన్సిపల్ గోదాదేవి మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలో 225 మంది విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థి మొదటి స్థానం సాధించడం గర్వకారణమని తెలిపారు.ఏజీఎం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 'గోడార్డ్ ప్రాజెక్ట్ థీమ్'ను అద్భుతంగా రూపొందించినందుకు ఈ పురస్కారం లభించిందని చెప్పారు. అనంతరం పుట్టంబర నితీష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం వెంకట్ రెడ్డి,ప్రిన్సిపల్ గోదాదేవి,కోఆర్డినేటర్ రఘువంశి, డీన్ చైతన్య, ఐకాన్ ఇంచార్జ్ సివిఆర్, సి బ్యాచ్ ఇంచార్జ్ శ్రీధర్, ఎస్ ఇంచార్జ్ రాంబాబు, ఏవో క్రాంతి, నాసా మెంటర్ నవీన్ యాదవ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# చేనేత పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి అసెంబ్లీలో కూడా చర్చిస్తాం

## కూనంనేని సాంబశివ రావు












ఇంద్ర పార్క్,మార్చి 25(నగరనిజం ప్రతినిధి): ఆర్థికంగా రాజకీయంగా చేనేతలకు అన్యాయం చేస్తున్నారు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వక్తులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వనం శాంతి కుమార్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రిటైర్డ్ ఐఏఎస్ బిసి ఇంటలెక్చ్ వల్ ఫోరమ్ చైర్మన్ చిరంజీవులు, సి ఐ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముషం రమేష్, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, హాజరయ్యారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే తెగించి పోరాడాలని పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు. ఎన్ని ధర్నాలు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఈ కాలంలో ధర్నాలు విఫలమవుతున్నాయి అన్నారు. గతంలో ప్రభుత్వాలు ధర్నాలు చేస్తే వెంటనే స్పందించి ఏదైనా సమస్య ఉంటేనే కార్మికులు ధర్నాలు చేస్తారని గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసేవని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ వచ్చిన తర్వాత ధర్నాలకు ప్రాధాన్యత తగ్గిపోయిందని ధర్నాలు చేస్తున్నాము అని పిలిపిస్తే ఎక్కడికక్కడ అరెస్టులు గృహనిర్బంధాలు చేస్తూ అణిచివేస్తున్నారన్నారు. స్వేచ్ఛ లేకుండా అయిపోతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు చేస్తున్న ధర్నాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని అలా కకుండా ప్రజలు ధర్నాలు చేసుకుంటే చేసుకొనిలే మాకేంటి అని వదిలేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీలు ఎల్ రమణ,నెల్లికంటి సత్యం, తీన్మార్ మల్లన్న, లు మాట్లాడుతూ. వ్యవసాయం తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన చేనేత పరిశ్రమలు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. చేనేత పరిశ్రమ కార్మికులకు అనేక హామీలు ఇచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి ప్రభుత్వం వారి ఓట్లను కొల్లగొట్టి గద్దెనెక్కిందని నేడు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోగా విసుమరిస్తుందన్నారు. చేనేత కార్మికులకు అమలు చేస్తున్న త్రిఫ్ట్ పథకంలో కార్మికులు నెలల నుండి రికరింగ్ డిపాజిట్ చేస్తున్న ప్రభుత్వం మాత్రం రెండు నెలలు మాత్రమే డిపాజిట్ చేసి మళ్లీ చేయలేదు బకాయిలు ఉన్న రూపాయలను వెంటనే డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. 2026. 27 బడ్జెట్ లో చేనేతలకు 2000 కోట్ల రూపాయలు టెక్స్ టైల్స్ పవర్ లోన్స్ కు రెండు వేల కోట్ల రూపాయలు వేరువేరుగా కేటాయించాలని ఆ విధంగా బడ్జెట్ ను సవరించాలని కోరారు. కార్మికుల పోరాట ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల రుణమాఫీ చేస్తామని ప్రకటించిందని పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి జీరో వడ్డీతో కొత్త రుణాలు ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ముందుంటామని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ. పోరాటాల ఫలితంగా సాధించుకున్న పథకాలైన జాతీయ చేనేత బోర్డు, హంఢ్రీ క్రాఫ్ట్ బోర్డ్, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్, హౌస్ కం వర్క్ షెడ్ పథకాలను అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రద్దుచేసి చేనేత పరిశ్రమ ముడిసరుకులైన రంగోలి రసాయనాలతో పాటు చేనేత చీరలపై జీఎస్టి విధించి దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమలు చావు దెబ్బ కొట్టింది అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిన్నర తర్వాత తెలంగాణ చేనేత కార్మిక సంఘం పోరాటం ఫలితంగా రుణమాఫీ అమలు అయిందని గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న భరోసా పథకం అమలు చేయకుండా త్రిఫ్ట్ పథకంలో చేనేత కార్మికులు డిపాజిట్ చేసిన రెండు నెలలు వేసి మినకుండి పోయిందన్నారు. చనిపోయిన నేత కార్మికుల కుటుంబాలకు సంవత్సరం దాటిన నేటికి నేతన్న భీమా ఎక్స్గ్రేషియా రాలేదని తెలిపారు. 13 సంవత్సరాల నుండి ఎన్నికలు నిర్వహించకుండా చేనేత కార్మికులకు రాజకీయంగా అధికంగా దెబ్బతిస్తుందని చేనేత పరిశ్రమ పై ఆధారపడి జీవిస్తున్న వేలాది చేనేత కార్మికుల కుటుంబాలను క్రెడిట్ రుణాలను మాఫీ చేయకుండా వీధిపాలు చేస్తుందన్నారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన చర్చలు జరిపిన పథకాలకు డబ్బులు కేటాయించకుండా చేనేత పరిశ్రమ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఐదు లక్షల వరకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని అర్హులైన చేనేత కార్మికులకు వేస్తున్న జియో టాక్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. వర్క్ టు ఓనర్ పథకం వెంటనే పూర్తి చేసి పవర్లూమ్ కార్మికులకు అందించాలన్నారు. ప్రభుత్వ ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు పవర్లూమ్ కార్మికులకు అనుబంధ కార్మికులకు సబ్సిడీ అందించాలని కార్మికులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నుండి రావలసిన వస్త్ర పరిశ్రమ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. చేనేత పవర్ లూమ్ కార్మికులందరికీ రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో ఆప్కో మాజీ డైరెక్టర్ అదిగోప్పుల సత్య నారాయణ, రామచంద్రం తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, మత్స్య కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి లేల్లల బాలకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య , చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసి కంటి లక్ష్మీనరసయ్య,ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చోళ రాజేశం రాష్ట్ర అధ్యక్షులు బాసాబత్తిని రాజేశం,కోమటి సత్య నారాయణ, చెరుకు స్వామి, ఎలగందుల కృష్ణ, గుర్రం నాగరాజు, వర్కాల చంద్ర శేఖర్, చింతకింది రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

